

ఎల్లమ్మ

మండపాక రాజేశ్వరశాస్త్రి

ఊరోరు శివార్లలో పలెపట్టులలో బ్రతికే ప్రజానీకానికి కోడికూత సహజంగా సైరన్‌లాగే సంచలనాన్ని కలగజేస్తుంది. దరిదాపు అందరూ బస్తీలో కూలీనాలీ, పనీపాటూ చేసుకుంటూ పొట్ట పోషించుకొనే పాటకజనమే. వీళ్ళందరూ కోడికూత వింటూనే లేస్తారు. గబగబా కాలకృత్యాలు నిర్వర్తించుకొని, అదీ యిదీ సర్దుకొని, ఐదుగంటలలోపుగానే అందరూ బస్తీలో ప్రవేశించి ఎవళ్ళ పనులలో వాళ్ళు సర్దుకుంటారు.

ఒకనాటి తెల్లవారుఝామున బస్తీలోని యిళ్లలో పాచిపనిచేసే స్త్రీలు కొందరు ఊరిలో ప్రవేశించి ఒకరొకరుగా ఒక్కొక్క ఇంటివద్ద ఆగి, తలుపుతట్టి, తెరవగానే లోపల ప్రవేశించారు. వీళ్లలో ఎల్లమ్మ ఒకతె. ఆమె ఒకయింటి గుమ్మంలో ఆగి తలుపు తట్టుతూ 'బాబూ, బాబూ' అని పిలిచింది. ఏమీ జవాబూ లేక, తలుపూ తెరవకపోగా ఆమె ఆశ్చర్యపడి, తలుపు గట్టిగా తోయగా తలుపు తెరచుకుంది. బహుశా ఇంటి యజమాని రాత్రి తలుపు గడియ వెయ్యడం మరిచిపోయి ఉంటాడనుకొని, ఆమె మామూలు ప్రకారం లోపల ప్రవేశించి, తను నిత్యమూ చేస్తున్న ఊడుపూ, కళ్ళాపూ, అంట్లూ చెంబులూ తోమడమూ వంటి పనులలో కావలసిన చీపురూ, చేట, తట, అలుకుగుడ్డ మొదలైనవి వెతికి తీసింది. అన్నిటికన్నా ముఖ్యం నీళ్ళు. నీళ్లు ఇంటిలోపల లేవు. నూతిలో తోడితేనేగాని నీళ్ళు దొరకవు. నుయ్యి తలపెరట్లో ఉంది. పెరటికి పోవడానికి పెరటితలుపు తియ్యాలి. మామూలుగా పెరటితలుపు రాత్రిపూట కప్పతాళం వేసిఉంటుంది. ఇప్పుడూ అలాగే తాళం వేసిఉంది. తాళంచెవి బాబుగారి నడుగుదామని ఎల్లమ్మ ఆయన గదివేపు వెళ్ళింది. గది తలుపు చేరవేసి ఉంది. ఆమె బయటనే నిలబడి 'బాబూ, బాబూ" అని పిలిచింది. జవాబులేదు. కాస్త గొంతుక హెచ్చించి పిలిచినా జవాబులేదు.

ఇంతవరకూ బాబు లేవకపోవడం ఎల్లమ్మకి నిజంగా ఆశ్చర్యం వేసింది. ప్రతినిత్యమూ ఆయన ఈ వేళకే లేచిపోయి కాలకృత్యలు తీర్చుకొని నూతి దగ్గర స్నానం చేస్తూ ఉండేవారే! ఆయనకి జపం, తపం, పూజవంటి చాదస్తాలు చాలా ఉన్నవి. అవన్నీ తెముల్చుకోవాలి గదా. అందుకే ఆయన అంత పెందరాళే లేవడం. ఎల్లమ్మకేదో అనుమానమైంది. ఆమె తలుపు మెల్లిగా తీసి లోపలికి తొంగిచూసింది. అప్పుడున్న కొద్దిపాటి వెలుగులో ఆమెకి కనబడిందేమంటే, బాబు మంచంపైని వెల్లకితలా పడుకొని ఉన్నారు.

"లే బాబూ లే, పొద్దెక్కి పోతూంది" అంది ఎల్లమ్మ. బాబు లేవలేదు. మళ్లీ కాస్త గట్టిగానే ఆమె లేపింది. బాబు ఉలకలేదు, పలకలేదు.

ఇదేదో విపరీతంగా ఉందని నిజంగా భయం వేసి, మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఎల్లమ్మ మంచందగ్గిరికి నడిచి బాబును పరీక్షగా చూసింది. కపాలు పడి నలుగుతూనే ఇప్పుడు వయసు మళ్లిపోయిన ఎల్లమ్మకంతా స్పష్టమైపోయింది. బాబు చచ్చిపడి ఉన్నాడు! రాత్రి నిద్దరలోనే ఎప్పుడో ప్రాణంపోయి ఉంటుంది.

సాధారణ సమయాలలో గంటలకొద్దీ కూర్చొని క్రమంగా తర్జన భర్జన చేసేనేగాని స్ఫురణకు రానివి క్లిష్టపరిస్థితులలో లిప్తకాలంలో లక్ష సంగతులు మనసులో మెరుపులా స్ఫురిస్తవి. గుండెల మీద గుద్దినట్లు ఆమెకి మొటమొదట తట్టింది. వెంకట్రామయ్య బాబు చచ్చిపడి తన కంటికి కనబడుతున్నాడు. తను తాకట్టుపెట్టిన నాను జిగినీతో సహా ఐదుతులాలకెక్కువుంటేదు. బాబింకా పెట్టెలోనే అట్టే పెట్టుకున్నాడు. తొలిరోజే తను వడ్డీతో సహా, దవ్వబిళ్ళ

లాంటివి, నూటముప్ఫై రూపాయిలు సీదాగా చెల్లించివేసినా (తనెంతకాళ్ళా వేళ్ళా పడింది! బతిమాలింది! ఏడ్చింది! ఆయన ఐదు రూపాయలైనా వడ్డీలో తగ్గించలేదు!) 'లక్షింవారం, శుక్రవారాల్లో తన బంగారం ఇవ్వననీ, శనివారం తప్పకుండా ఇస్తాననీ తనకు మాటిచ్చాడు. ఇప్పుడతడు ఇలా ఐపోయాడే, ఇక తన వస్తువు తన కెలాగు తిరిగి దక్కుతుంది? ఈ డబ్బు జతపెట్టడానికి ఆమె యెంత అవస్థపడ్డది! తన కొడుకున్న ఒక్క అసరా బండీ యెడ్లే. ఎడు తెగనమ్మితేనేగాని డబ్బు పేలలేదు. ఇందుకు కొడుకుతో హోరాహోరీగా పోరింది, చివరికి చెప్పు దెబ్బలుకూడా తిన్నది!

వెంకట్రామయ్యబాబు చూస్తే డెబ్భయేళ్ళపండు ముసిలి. నలభైయేళ్ళు ఎసేటు సర్వీసు చేసి, పెద్దపేరుపొంది, పనిలో చాకచక్యంచూపుతూనే బాగా డబ్బు చేసుకున్నాడు. ఏడెనిమిదిగరిశెల అంబారం వచ్చే భూమి కొన్నాడు. దిట్టమైన నాలుగిళ్ళలోగిలికట్టి, సమస పరికరాలూ సమకూర్చుకున్నాడు బాగా కుదుటబడి మరీ రిటైరయ్యాడు. ప్రస్తుతం ప్రశాంతంగా కాలం గడుపుతున్నాడు. సంతానం ఒక్క ఆడపిల్లే. పిల్ల పెళ్ళి దివ్యంగా చేశాడు. అత్తవారింట్లో ఇద్దరుకొడుకులూ ఒక కూతురుతో ఆమె హాయిగా బ్రతుకుతున్నది ముసలాయన భార్య శేషమ్మ ఈ కష్టసమయంలోనే ఇంట్లో లేకపోయింది. ఆవిడ ప్రస్తుతం కూతురినిచూడడానికి అక్కడికి—పది మైళ్ళ దూరంలోఉన్న కూతురు గ్రామానికి—వెళ్ళి ఉంది. అలా అప్పుడప్పుడూ కూతురింట క్యాంపుచేసి, యథేచ్ఛగా ఓవారంరోజుల పాటుండి, కూతురికీ ఆమెపిల్లలికీ బాగా ముటచెప్పి తిరిగి తనయింటికి రావడము ఆమెకి పరిపాటే. వయస్సు ముదిరినా, తల తెల్లగా తేరిపోయినా, ముసిలి శేషమ్మకి ఒంటినిండా ఆభరణాలలంకరించుకోవడమన్నా, రంగురంగు చీరెలు సింగారించుకోవడమన్నా, పేరంటాలకి పోవడమన్నా మోజేమీతగలేదు. నోములంటే, వ్రతాలంటే పరమప్రీతి, విందులు చెయ్యడమూ. విందులకు నలుగురింటికీ వెళ్ళడమూ, నలుగురినీ ఇంటికి పిలిచి ఇష్టాగోష్ఠులు జరపడమూ ఆమె కతి సరదా. ఆమె ఆడంబరాలేమీ తగ్గలేదు. ఏళ్ళు పైనిబడుతున్న తనభర్త కారోజు కారోజు చిరాకుకోపమూ, అత్యాశతో ధనలోభమూ హెచ్చుతూ వచ్చినవి. తను ముద్దుగా చేసిన ప్రతిపనీ అతడికి విసుగుకలిగించింది. ఆఖరికతడినోట తనకు తిట్లూ దిగదుడుపులూ వ్యవహారం వరకూ వచ్చింది. ఇందుకే శేషమ్మ కూతుర్ని చూడడమనే మిషతో ఇట్లా ధరా వాతావరణం మార్చి నాలుగు రోజులపాటు శాంతంగా, సరదాగా మనమలూ మనమరాళ్లతో కాలంగడుపుతూ వస్తున్నది.

భార్య పొన్నూరులో ఉన్న రోజులలో వెంకట్రామయ్య తనే వండుకుతినేవాడు. గ్రామంలో బంధువులున్నారు—కొందరు దగ్గిర చుట్టాలు కూడాను—అయితే అతనిది ఒంటరి తత్వం. తను ఎవ్వరింటికీ వెళ్ళడు, ఎవ్వరినీ ఇంటికి పిలవడు. ఏ విషయంలోనూ ఏ చుట్టం సాయమూ తన పేక్షించనూ లేదు, తన కవసరమూ లేదు. చుట్టాలందరూ 'నీ యింటికి వస్తే ఏమిస్తావు, మా యింటికి వస్తే ఏమి తెస్తావు' అన్న బాపతే అంటాడు వెంకట్రామయ్య. 'చుట్టాలను దూరంగా వుంచు' అంటూ ఇంట్లో రోజూ వలిసాడు. ఏ బంధువుకీ ఒక కానీ ఇవ్వడం, ఇవ్వలేదు. ఇందుకేనేమో, గ్రామంలో వున్న జ్ఞాతులందరికీ అతడంటే ఈర్ష్యా, కోపమూ, ద్వేషమూనూ.

ముదిమి తెచ్చిన ముఖ్య పరిణామము వెంకట్రామయ్యకప్పుడప్పుడు వాతావరణంలో మార్పు ప్రభావంగా గుండెలో నొప్పివచ్చి ఒకటి రెండురోజులు కొద్దిగా బాధపెట్టి చివరికి దానంతటదే నయమౌతూ వస్తున్నది. అది ఎప్పుడో ప్రమాదం చెయ్యవచ్చని అతడికి తెలియదు, అతడే వైద్యుడిని సలహా చెయ్యలేదు. గతరాత్రి బహుశా పెద్దగా గుండె నొప్పి వచ్చి నిద్రలోనే అతడి ప్రాణం కాస్తా హరీమని ఉంటుంది భార్యాదగ్గిర లేదు కూతురూ లేదు—ఆఖరికి ఏ యితరులూ లేరు.

ఇన్ని పాత విషయాలూ ఎల్లమ్మ బుర్రలో ఏకకాలంలో మెరిశాయి. ఆమెకి అపరితంగా భయం పట్టుకుంది. గుండెలు కొట్టుకున్నవి. కాళ్ళు వణికినవి. ఇక ఒక్కక్షణమేనా అక్కడ నిలబడితే ప్రమాదం. వెంటనే అక్కడినించి పారిపోవడమే మంచిది. ఉంటే తన పీకలమీదికే రావచ్చు. ఇలా అనుకుంటూనే ఆమె వెనకతిరిగి రెండు అడుగులు వేసింది. మరుక్షణమే గుండెమీద గ్రుద్దినట్టుగా తన నానుసంగతి జ్ఞాపకం వచ్చింది. అయ్యో, ఐదు తులాల నానూ వదులుకోవలసిందేనా? ఈ జన్మలో అలాంటి సరుకు సంపాదించగలదా? అంతసొమ్మూ సీదాగా చెల్లించివేసిందే! ఏమిదారి! ఆమెకు ఒక్కసారిగా ఆందోళనా, భయమూ, దుఃఖమూ, నిస్పృహా కలిగి, పిచ్చెత్తినట్టై, ఆఖరికి ఒక విధమైన ఉన్మాదంగా పరిణమించింది. ఆవేశం అంతకంతకూ అధికమైంది. అవశంగా ఆమె ఏవో పనులు చకచకా చేసింది చావిట్లోకి వెళ్ళి వీధితలుపు గడియపెట్టింది. గదిలోకి వచ్చి తలుపు వేసింది. చావులు చూడడం తన కనుభవమే. ప్రాణంపోయిన వెంకట్రామయ్యబాబును ముట్టడమేమంత భయమనిపించలేదామెకు. చలనంలేక పడివున్న ఆయన దగ్గిరికివెళ్ళి ఎల్లమ్మ నాలుగు మూలలూ చూసింది. తాళాల గుత్తి కనబడలేదు. మంచం, పరుపూ తలగడా చేతితో తట్టుతూ అంతటా తడిమి చూసింది. చివరికి తలగడా క్రింద తాళాల గుత్తి దొరికింది వెంటనే ఆమె గోడచేర్పుగా పేర్చిఉన్న పెట్టెలన్నీ పరీక్షగా చూసింది. ఒకానొక సందుగు పెట్టెలో బాబుగారు డబ్బూ, బంగారం, పద్దు కాగితాలూ ఉంచుతారని ఆమె ఇదివరలో అనేకసార్లు చూసే ఉంది. ఎలాగైతేనేం, పెట్టె కనబడ్డది. రెండుమూడు పెట్టెలు కిందికి దింపి సందుగుపెట్టె ఇవతలికి తీసి, గుత్తిలో ఉన్న తాళంచెవులు ఒకటొకటిగా ప్రయత్నిస్తూ ఒకతాళంతో పెట్టె తెరిచింది మూతెత్తి లోపలికి చూసింది. ఆమెకికళ్ళు జిగేలుమన్నవి! పెట్టె అరలనిండా రూపాయిలే! నోట్లే! అడుగు అరలో అంతా బంగారమే! పెట్టెలో నాలుగు మూలలా నగలు జిగజిగలాడుతూ కనబడ్డవి! ఇంత ఐశ్వర్యమూ చూడగానే ఆమెకిదివరకున్న ఆ కాస్త మతీ పూరిగా పోయింది. గురాశపట్టుకుంది. ఒక పాడుగుడ్డ నేలమీద పరిచి, పెట్టెలో ఉన్న అన్ని రూపాయిలూ, నోట్లు, బంగారం వసువులూ గుడ్డమీద కుమ్మరించి మూట కట్టింది చుట్టూ చూసింది. గూట్లో కొన్ని పుస్తకాలు కాగితాలు కనబడ్డవి. అవి తీసి పెట్టెలో జాగ్రత్తగా సర్దింది మూత వేసి తాళం తిప్పింది పెట్టెయథాస్థానంలో ఉంచి తక్కిన పెట్టెలు యథాస్థితిలో సర్దింది. తాళాలగుత్తితో పరుగునవెళ్లి పెరటి తలుపు తీసి, గదిలోకి వచ్చి, తాళాలు యథాస్థానంలో తలగడా కిందపెట్టి, ఇవతలికి ధనం మూటతో సహావచ్చి గదితలుపు చేరవేసి, చకచకా అడుగులు వేస్తూ పెరటి గుమ్మంలోంచి పెరట్లోకి వచ్చి తలుపు దగిరగాలాగి, సందు సందులలోనే నడిచి తనయింటికి చేరుకుంది. పెరటి సాలలో పేడ కూడవేసున్న తన కోడలి కళ్ళబడకుండా ఇంట్లోకి వెళ్లింది. కొడుకింట్లో లేడు. చప్పుడు చెయ్యకుండా ఎల్లమ్మ నిచ్చెనవేసి, అటకఎక్కి, ఒక పాతకుండలో తను తెచ్చినధనం మూటఉంచి, కుండలో మిగిలిఉన్న కాళీలో పాతగుడ్డలు కుక్కి, కుండమూగు మూలగాపెట్టి, మీద మరిరెండు కుండలు దొంతిగాపేర్చి, గుప్చుచప్పుగా క్రిందికి దిగిపోయింది.

అప్పటికి ఉదయం ఆరుగంటలైంది. మాఘమాసం రోజులు, సూర్యోదయమింకా కాలేదు. ఎల్లమ్మ ఏమీ ఎరగనట్టుగానే ఎప్పటిలాగే ఎకాయెకీ నడిచి వెంకట్రామయ్యగారి ఇలుచేరి, వీధితలుపు గట్టిగా కొడుతూ, "బాబూ, బాబూ" అని గోల చేస్తూ పిలిచింది. కావాలని ఆమె మరీ

★ ఎల్లమ్మ ★

గోలగా పోరుచేసేసరికి వీధిలో కొందరామె చుట్టూ చేరి తలో ప్రశ్న వేశారు.

"ఏమిటోనండి, ఏమీ తెలియకుండా ఉంది" అంది ఎలమ్మ. "ఎంత కొట్టినా తలుపు తియ్యరు. ఏమైందో ఏమో?"

ఒకరిద్దరు తలుపు దపదబాబాది చూశారు గాని లాభం లేకపోయింది. క్రమంగా ఇంటి ముందొక గుంపు చేరింది. ఈ వార్త అలా గాలాగపాకి వెంకట్రామయ్యగారి బంధువులకు తెలిసి వాళ్ళూ వచ్చారు. అప్పటికప్పుడే ఏడుగంటలు దాటింది. బంధువుల్లో కొస్త దగ్గిరివాళ్ళాలోచించి, వీధితలుపులు బలవంతంగా తెరవడంతప్ప గత్యంతరం లేదని నిర్ణయించారు. తక్షణమే పనివాడిని పిలిచి తలుపులు తెరిపించారు. వీధిలో చేరిన గుంపు ఒక్కుమ్మడిగా లోపలికి చొచ్చుకువస్తూ ఉంటే, బంధువులు వాళ్లందరినీ వారించి ఆ వీధిలో ఉన్న ఐదారుగురు మోతుబరులతో ఇంట్లో ప్రవేశించారు.

వెంకట్రామయ్య జాడ లేదు. ఇంట్లో ఏమూలా ఆయన కనబడలేదు ఇంకా పడుకొనే ఉన్నాడేమో అని ఆయన గది గుమ్మం దగ్గ నిలబడి పిల్చారు. జవాబు లేకపోగా, ఒక బంధువుడు గదితలుపు తోశాడు. లోపలికో అడుగు వేశాడు. అవతలిగోడ కానుకొని ఉన్న మంచం వేపు చూశాడు. మరేముంది! వెంకట్రామయ్య మంచంమీద వెలకితలా పడుకొని ఉన్నాడు. ఊర్ధ్వదృష్టిలో ఉన్నాడు. దచ్చిపోయినట్టే, అనుమానం లేదు. ఈ దృశ్యం చూడగానే అక్కడున్న వాళ్లందరికీ ఒక్కసారిగా గాభరా పుట్టింది. భయం పట్టుకుంది. వెంటనే గదితలుపు చేరవేసి అందరూ వీధిలోకి వచ్చేశారు. లిప్తలమీద బంధువులయిల్లిను ఈ వార్త చేరవేశారు. ఇంతకోలాహలం జరుగుతున్నా, ఎల్లమ్మ నోరు మెదపకుండా అందరిమధ్యా తిరుగుతూ, అంతా చూస్తూ అక్కడే ఉంది.

ఉదయం పదిగంటలలోగానే ఈ హఠాన్మరణవార్త శేషమ్మగారున్న ఊరికి చేరవేశారు. ఈవార్త వింటూనే శేషమ్మ కొయ్యబారిపోయింది. తనస్థితి ఇలా పరిణమిస్తుందని ఆమె కలలోనూ ఊహించలేదు. నిండు ఐదువతనంతో, పసుపూ కుంకుమతో తనే ముందువెళ్లిపోతానని ఆమె అందరితోనూ అంటూఉండేది. ఎలాగో బలవంతాన అంతకష్టమూ దిగమ్రింగి, అల్లుడి సాయంతో శేషమ్మ కూతురుతో స్వగ్రామం చేరుకుంది—మూడుగంటలు కాకుండానే, అందరి కష్టాలలోనూ ఆదికి ముందు తనే నిలబడి, సానుభూతి చూపి చేతనైన సాయం చేసే శేషమ్మ కనబడగానే అందరూ తండోపతండాలుగా వచ్చి ఆమెని పరామర్శించారు. ఇంతకష్టంలోనూ ఆమె ముందు కర్తవ్యం మరిచిపోలేదు. తాళాలు వెతికి తీయించింది మూలనున్న సందుగుపెట్టె ముందుకు తెచ్చి మూత తీయించింది. లోపలనిండా ఉన్న పాతకాగితాలు పెకిజల్లి అడుగువరకూ చూసినా ఆమెకి ఎర్రనిఏగాని ఎక్కడా కనపడలేదు. పెట్టెలన్నీ వెతికించింది. ఎక్కడా డబ్బు కనబడలేదు. ఆమె కమితాశ్చర్యమైంది. డబ్బూ బంగారం ఏమైనట్టు? ఇందులో ఏదో తంత్రం వుందనీ, ఎవరితోనూ ఘర్షణపడడానికి ఇది సమయం కాదని నిశ్చయించుకొని ఆమె తన వంటిమీదినగలు ఒకటిరెండు పైకితీసి తక్షణం అమ్మివేసి కొంతరొక్కం కూర్చుకుని, జరగవలసిన కర్మకాండ యావత్తూ తన తాహతుకుతగ్గట్టుగానే జ్ఞాతులసహాయంతో యథావిధిగా జరిపించింది.

ఇప్పుడాయింట్లో అన్నింటికీ ఎల్లమ్మే అవసరమైంది. "ఎల్లమ్మా, ఇదితే, అదితే," 'ఎలమ్మా, వారిని పిలువు, వీరిని పిలువు', 'ఎల్లమ్మా, ఇది తొందరగా చేసిపెట్టు, అది చేసిపెట్టు' అంటూ శేషమ్మకి ఎల్లమ్మే ముఖ్యఎతుతి ఐపోయింది. శేషమ్మకు వచ్చిన కష్టం తనకు వచ్చినట్టే ఎల్లమ్మ ప్రవర్తిస్తూ, ఆలాగే నేర్పుగా, ఓపికగా అన్నిపనులూ చేస్తూవచ్చింది. ధనం చౌర్యమైపోయినట్టు శేషమ్మకి నిజంగా అనుమానం వేసింది. ఒకటి రెండు రోజులైన తరువాత ఘర్షణ తప్పలేదు. టూకీగా చెప్పాలంటే, పెట్టెలోని నగదూ బంగారమూ ఇదివరకే శేషమ్మ కాజేసి ఇప్పుడు నంగనాచి వేషాలు వేస్తున్నదని బంధువులూ, బంధువులలోనే ఎవడో ఒకడు కాజేసిఉంటాడని శేషమ్మా కొంతవరకు చాలాఘర్షణ పడారు. పక్కనే ఉన్న ఎలమ్మమీద ఎవరిదృష్టీ పడలేదు. ఆమె శేషమ్మతోపాటు సానుభూతిగా తనూ దుఃఖించింది. అందరిదగ్గిరా అతి వినమ్రతతో ప్రవర్తించింది. ఇంటివిపత్తు తనదేఐనట్టు సంచరించింది. నిరాఘాటంగా పన్నెండురోజుల కర్మ పూర్తయింది. మొత్తంమీద బంధువులకందరికీ సంతుష్టి కలిగింది. అందరూ ఎవరియిళ్లకు వారు వెళ్లిపోయారు.



"ఛా! ఛా! స్టుపిడ్ ఎలక్ట్రిషియన్! —ఈ స్విచ్ తల్లక్రిందుగా బిగించేశాడు!"

ఇన్నాళ్ళకి ఇంటికి వెళ్ళడానికి అవకాశము చిక్కి ఊరు శివారలో ఉన్న తన యింటికి ఎలమ్మ బయల్దేరింది. ఆమె సంతానం ఇద్దరు కొడుకులూ ఒక కూతురూ. కూతురు పెళ్ళయి అత్తవారింట వుంది. పెద్దకొడుకు లచ్చన్న భార్యతో ఇంట్లో తన దగరే ఉంటున్నాడు. తను ఇలు సమీపంగా వచ్చేసరికి గుడిసెలో కొడుకూ కోడలూ దేనికో తీవ్రంగా పోరుచేసుకుంటున్నారు. ఇద్దరినీ కూకలేస్తూ విసురుగా ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

లచ్చడో విచిత్రవ్యక్తి. వీడు 'స్వంత ఇంటికి శని, పొరుగింటికి పోలేరమ్మ' అన్నట్లు ఆమె బ్రతుకుకి దాపురించాడు. ఇంటిపనీ స్వంతపనీ అంటే పరమసోమరి. ఎంత చిన్న పనికీ ఇతరులు పిలిస్తే ఆసక్తితో సాయం చేస్తాడు. వ్యవసాయం పనులలో బహుదిట్ట. అందరికీ సలహాలిస్తాడు. అందరి దగ్గిరా తలలో నాలికలా మెసులుతాడు. తాతల నాటి నుండీ వస్తున్న తన ఎకరా మెటమాత్రం బాగు చేసుకోడు. కానీ పుచ్చుకోకుండా అందరి కుడిశెలూ నేస్తాడు. తన గుడిశె మాత్రం రెండేళ్లయి నేత లేక అలాగే కారుతూ ఉంది. ఊళ్లో ఏ జట్టీ వచ్చినా తన మధ్యవర్తిత్వం తప్పనిసరి. తను లేనిదీ ఏ కోడిపందెమూ, పొట్టేళ్ళ పందెమూ జరగడానికి వీలులేదు. గొప్ప మాటకారి. సబబులు తెలిసిన ఘటం. తన తీర్పుకు అంతా కట్టుబడి ఉండవలసిందే—కాని తన పెళ్లాంతో మాత్రం సమంగా వాదించలేడు, ఆమె వాగ్ధాటి గంగా ప్రవాహమే. యుక్తికి పది యుక్తులు, సబబుకి పదిసబబులు, మాటకి పది మాటలు ఏకధాటిగా అనగలిగిన ఆమె నేర్పుకు లచ్చడు బాగాతగ్గి తిట్టుకుంటూ అవతలికి పోతాడు.

లచ్చడు అప్పుడప్పుడర్ధా, రూపాయీ ఏదో వేళావిశేషంలో తెచ్చి తల్లి చేతులో

పెడతాడు. తరుచుగా వట్టి చేతులతోనే ఇంటికి వస్తాడు. ఇలా వచ్చిన నాడు తల్లిగాని భార్యగాని ఏమన్నా వాళ్ళను తిట్టి చెయ్యి చేసుకుంటాడు. వీడేమో ఆర్జించి తన దినం తీరుస్తాడనే నమ్మకం లేక ఎల్లమ్మ ఊళ్ళో ఆయింటా ఈ యింటా దాసీ పని చేసుకుంటూ కోడలిని కూలీపనులకుపంపుతూ పొట్ట పోషించుకుంటున్నది. తన రెండవ కొడుకు వెంకడిని దూరగ్రామంలో బంధువులయింట కంబారిపనికి కుదిర్చింది. వీడి ఆర్జనా అంతంతమాత్రమే. వీడికడుపు జరిగిపోవడమే పదివేలని ఆమె అనుకుంది.

పనికిమాలిన లచ్చడికి దుష్టసహవాసమూ, త్రాగుడూ, జూదమూవంటి ఆత్మవినాశక చేష్టలబ్బడంలో ఆశ్చర్యం లేదు. అవి అరోజు కారోజు అధికమౌతూ, చివరికి తనకీ కోడలికీ భరించలేనంతగా పరిణమిస్తూ వచ్చినవి. ఈ సమయంలోనే వెంకట్రామయ్యగారి చావూ, అందులో తను చేసిన నిర్వాకమూను. ఇప్పుడామెకి మరో సంకటం పట్టుకుంది. ధనం ఇంటో దాచినటు లచ్చడి కేమాత్రం గాలిసోకినా మరేమేనా ఉందా? మంచినీళ్ళలాగు డబ్బూ కరిగిపోతుంది. తను చేసినపని నలుగురికీ తెలిసిపోతుంది. కాని చిత్రమేమంటే, తను చేసిన పనికి ఎలమ్మ మనసు బాధపడలేదు. పాపభీతి కలగలేదు. ద్రోహం చేసినటు ఆమెకంత కన్నా తటలేదు. మీగు మిక్కిలి తన తెలివికీ నేర్పుకీ తనే తృప్తిపడ్డది. సంతోషించింది. తోటి దాసీపనివాళ్ళుమాత్రం ఏమి చేస్తున్నారుగనక! సమయం చిక్కితే ఏ వెండిగిన్నో కంచమో, పిల్లల మొలబిళ్లో చిక్కబట్టి, యజమానులతో ఘర్షణ వచ్చినప్పుడు వెయ్యి అబద్ధాలాడి తప్పించుకోలేదా? కుగుక కొట్టిన తన సగు కెలాగూ చిక్కబట్టుకోవాలి గదా. దానితో మరికొంత తెచ్చుకుంది. చేతికందించి చిక్కబట్టుకోవడం ఎవరు మానగలరు?

ఎప్పటిలాగే ఎల్లమ్మ శేషమ్మగారింటికి వెళ్ళి తన పని చేసుకుంటూనే ఉంది. దహనం తంతు జరిగిన తరవాత శేషమ్మ అవస చూసి అందరు బంధువులూ ఏడ్చారు. ఎల్లమ్మా ఏడ్చింది. శేషమ్మకి తగనికష్టం దేవుడు తెచ్చిపెట్టేడని అందరూ అంటే, ఎల్లమ్మ అనుకుంది దేముడే తెచ్చిపెటిన కష్టానికి ఎవరేమి చెయ్యగలరని అనుకుంటూ మనసు సమాధానపరుచుకుంది.

భర పోవడంతో శేషమ్మ పూర్తిగా మారిపోయింది. తన వంటిమీది బంగార మంతా పైకితీసి కూతురికి కొంత ఇచ్చివేసి మిగిలింది అమ్మి డబ్బుచేసుకుంది. అట్లే అత్యవసరం కాని వెండి, పాత్రసామానులూ నగదుగా మార్చివేసింది. నోములూ వ్రతాలూ కటిపెట్టి పూజలూ ఉపవాసాలూ జపాలూ ప్రారంభించింది. పేరంటాలకు బదులు భగవద్గీత పారాయణా, పిచ్చాపాటీ బదులు పంచదశీ పఠనమూ ప్రారంభించింది. అధ్యాత్మ రామాయణమూ, యోగవాశిష్ఠ మూటీకతో సహా చదివించుకొని ఆసక్తిగా వింటోంది. ఏదో మిషమీద నలుగురు బంధువులనూ పిలిచి ఇంత పప్పుకూడు పడేస్తుంది. బీదా బిక్కలాంటి బికారీలని పొమ్మనకుండా ఇంత పులుసూ అన్నమేనా పెడుతూ, ఎవరే యిబ్బందిలోపడి తన్నరించినా తను లేదనకుండా అంతో యింతో సాయం చేస్తూ, ప్రశాంతంగా, తృప్తిగా, పారమార్థికంగా జీవితం సాగిస్తున్నది. ఎవరియింటఏమి కష్టం వచ్చినట్టు తనకు తెలిసినా శేషమ్మ తప్పకుండా తను స్వయంగా వెళ్ళిగాని, పని మనిషిని పంపిగాని వారికి తగిన సాయం చేసేది. ఇన్ని విధాల అందరినీ ఆదుకుంటున్న శేషమ్మ తన కష్టసుఖాలలో తన్ను కని పెడుతూ తనతోనే ఉన్న ఎల్లమ్మను మరిచిపోతుందా? ఎల్లమ్మ ఇప్పుడు మరీ అభిమానపాత్రురాలైంది. దరిదాపు అన్ని రోజులూ ఎల్లమ్మతిండి ఇక్కడే. బోలెడు 'మిగుల్నూ తగుల్నూ' ఎల్లమ్మవే. అవన్నీ గంపలో ఇంటికి మోసుకుపోయి రాత్రిపూట తనూ కొడుకూ కోడలూ కడుపునిండా తినేవారు. శేషమ్మగారి యింట్లోని పాతపడలూ చీరలూ ఎలమ్మకే దక్కేవి. 'పంతులుగారి' పాతచొక్కాలూ, కోట్లూ ఎల్లమ్మకొడుకే తొడిగి కులికేవారు. శేషమ్మగారి కుటుంబంలో తానూ ఒకర్తెనని ఎల్లమ్మ ఇప్పుడు పూర్తిగా నమ్మింది. ఆమె అందరిదగ్గిరా శేషమ్మ మంచితనమూ, ఈవి, దైవచింతా మొదలైన సుగుణాలు చాటుతూ, విరుద్ధంగా అన్నవాళ్ళతో వాదోపవాదాలకి దిగేది.

ఒకనాడు మధ్యాహ్నము ఒంటిగంట వేళ ఎల్లమ్మ హుటాహుటిగా శేషమ్మగారింటికి వచ్చింది. శేషమ్మ నిద్రపోలేదుగాని, ఎండకాస్త తీవ్రంగా ఉంటే చావిడిలో చాప మీద నడుం చేరవేసి ఏదో పుస్తకం చూస్తున్నది. మూడురోజుల క్రితమే వచ్చిన కుమార్తె గదిలో నిద్రపోతున్నది. పిల్లలు పెరటిలో ఏదో సందడిచేనూ ఆడుకుంటున్నారు. ఎలమ్మ చూనూనే శేషమ్మ అంది: "ఏమే ఇప్పుడొగదులే వస్తేవు? ఇప్పటి కిప్పుడే ఏ మొచ్చిందే ఎల్లమ్మా?"

గాబరాపడుతూ ఎల్లమ్మ అంది: "లచ్చిగాడికి జొరమొచ్చిందమ్మా. ఇయాలి కేడు రోజులయింది. ఏటో బయమేస్తుందమ్మగారు పిలిసే పలకడు."

శేషమ్మకీ ఆత్రుత కలిగింది. "అమ్మా! అంత వరకూ వచ్చిందే? ఎవరికైనా వైద్యుడికి చూపించావా?"

"లేదమ్మా దానంతటదే తగ్గిపోదా అని ఊరుకున్నాను. ఇయాలచూస్తే యికటించింది."

"మరేం ఫరవాలేదులే. బహుశా సీరసం మీద మొహం తిరిగి ఉంటుంది. వెంటనే వెళ్ళి వాడికింత జావపట్టు, ఉండు చెప్తాను."

ఈమాటలంటూ శేషమ్మ లేచి గదిలోకి వెళ్ళి మంచంకింద ఉన్న సందుగుపెట్టె ఇవతలికిలాగి, చావిట్లోకి తెచ్చి, కొంగున ముడి కట్టిన తాళంతో మూత తెరిచి, అర్రలోంచి ఐదు ఇచ్చురూపాయిలు పైకితీసి ఎల్లమ్మతో అంది:

"ఇగుగో వైద్యుడిదగ్గిరికి పరిగెటి ఈ ఐదు రూపాయిలూ చేతులో పెట్టు. అదేమిటే ఎలమ్మా!"

ఆమెకి ఎల్లమ్మ వైఖరిచూసి దిగ్భ్రాంతి కలిగింది. సందుగుపెట్టె తన కళ్ళపడిందో లేదో, కొడుకు గురించి బెంగపెట్టుకుంటున్న ఎల్లమ్మ తల గిర్రున తిరిగింది. బుర్రలో వెయ్యి సంగతులు దొరుతూ తిరిగిపోతున్నవి. మెరుపులా వెంకట్రామయ్య వచ్చి, "ఇంత స్వామి ద్రోహం చేసావే ముండా!" అని తిడుతున్నాడు. దహనం నాటి శేషమ్మముఖం దాగరంత పెద్దదిగా కనబడి.

"నిన్ను వెయ్యికళ్లతో చూసుకుంటున్న నన్నే ఇలా చేస్తావుటే భడవా!" అంటున్నది పదిమంది బంధువులూ తన చుట్టూ మూగి, తన వేపే వేలుపెట్టి చూపుతూ, "ఈ ముండేనర్రా ఆస్తి కాజేసింది. మనందరి మీదా దొంగతనం మోపేరు. ఇదేనర్రా, ఇదేన్నా!" అంటూ గోలచేస్తున్నారు. తటాలున లచ్చడు మంచం మీద లేచి కూచొని "అంత డబ్బూ అటక మీదటుకొని సుసస్తూంటే మూస్తున్నావంటే!" అంటూ అరుస్తున్నాడు.

"అదేమిటే!" అంటూ అమితాశ్చర్యంతో అడిగింది శేషమ్మ. "అవెర్రిచూపేమిటే? ఇందు, ఈ ఐదు రూపాయిలూ తీసుకొని వైద్యుడికియ్యి"

శేషమ్మ గొంతుక వినగానే ఎల్లమ్మ మళ్ళీ ఈలోకంలో పడ్డది. "అమ్మో!" అని గట్టిగా అరిచింది "నాకొద్దమ్మోయ్! నాకా డబ్బు వద్దమ్మోయి వద్దమ్మోయి! నాయినోయ్!" భయోత్పాతంతో నిండిన పెద్ద గొంతుకతో అరుస్తూ ఎల్లమ్మ అక్కడి నుండి పారిపోయింది.

ఎల్లమ్మ వడివడిగా సరాసరి ఇంటికే

(42 వ పేజి చూడండి)

నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది. మేహము, నిక్షాత, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20 రు డబ్బీ రు. 3-4-0 పోస్టేజిరు. 1-1-0
పి. సి. ఏ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.

★ ఎల్లమ్మ ★

(23-వ పేజీ తరువాయి)

వెళ్ళింది. కోడలిచేత తొందర తొందరగా జావ కాపించి, బ్రతిమాలి బ్రతిమాలి ఎంతో కష్టం మీద మూడు గుక్కలు బలవంతంగా కొడుకుచేత మింగించింది. తడిగుడ్డతో వాడిముఖం బాగా నిదానంగా వొత్తింది. విసనకర్రతో విసిరింది. శేషమ్మ తల్లి చెప్పిందే నిజం. కడుపులో ఏమీ ఆహారం లేకే నిస్త్రాణగా మొహం తిరిగి పడిపోయిన లచ్చడు ఇప్పుడు కళ్ళువిప్పి చూశాడు. ఎల్లమ్మ చప్పున లేచింది. కోడలిని అక్కడే నిలబడి, కావలిస్తే మళ్ళీ జావపట్టమని పురమాయించింది. వెంటనే వీధి లోకి వచ్చింది. ముక్కు కమ్మ ఊడదీసి చేత పట్టి కోమటింటికి పరిగెత్తింది. అతనిదగ్గర కమ్మతాకట్టు పెట్టి పదిరూపాయలు పుచ్చుకొని, గబగబా అడుగులువేస్తూ వైద్యుడు గుర్లింగాచారి యింటికి పరిగెత్తి ఆయన చేతులో ఐదురూపాయిలుపోసి ఇంటికి తీసుకువెళ్లి కొడుకును చూపిస్తూ, వాడిని ఎలాగైనా రక్షించమని ప్రాధేయపడుతూ ఏడ్చింది అతడు లచ్చడిని చూసి, చేయిపట్టి నాడి పరీక్షించి, తల కాటించి, "ప్రాణ భయంలేదు ఎలమ్మా" అంటూ భరవసా ఇచ్చాడు. మందు లేవో పురమాయించాడు

ఎలమ్మ శేషమ్మ యింటికి పనికివెళ్ళడం మానివేసింది ఇది మూడో రోజు. వచ్చే ప్రాణం పోయేప్రాణంతో మూలుగుతూ మంచంమీద పడిఉన్న తన తొలిసంతానం లచ్చన్నను జూసున్న ఆమె మనస్సులో పాత విషయాలన్నీ అవశంగా ఒకటితరవాత ఒకటి మెదిలినవి, ఒక పదేళ్ళపిల్ల గావంచా మొలకు చుట్టి, చింపిరిజుత్తు గాలికి ఎగురుతూ నెత్తిమీది తట జారుతూంటే మళ్లీ సర్దుతూ, పదాలు పాడుతూ, పేడకూడ వేస్తూ. మురికిచేతులతోనే అంబలి జుర్రుతూ కనిపించింది. ఎర్ర రంగు గావంచాలు కట్టిన పన్నెండేళ్ళ బాలికలు గంపలూ బొరిగెలూ చేతబట్టి గరిక వేళ్ళకు పోతూ, దారినిపోయే పండు ముసిలి తాతను చూపించి "అడుగోయే నీ మొగుడు—కాదు నీ మొగుడు" అంటూ విరగబడి నవ్వుకుంటూ కనిపించారు. మందార పువ్వురంగు కోకకట్టి, కచోరాల వాసనతో, నిగనిగలాడేట్లు మెడ తిప్పుతూ, చేతులూపుకుంటూ, వయ్యారంగా, తలమీద తిండి గంపతో భర్తున్న పొలానికి పోతున్న ఒక నవయువతి కనబడింది. ఎల్లమ్మకి చిరునవ్వుతో పాటు కళ్ళనీళ్ళుకూడా వచ్చినవి. పిల్లలతో వేగలేక వాళ్లను తిట్టి కొడుతున్న ఎల్లమ్మముఖం కనిపించింది. భర్త చనిపోయి దుఃఖంతో దొర్లుతున్న దైన్యముఖం కనిపించింది. కూలిపుట్టక, కుమిలి కుమిలిఏడుస్తున్న అనాథముఖం కనిపించింది. ఆకలి తట్టుకోలేక ఏడుస్తున్న పిల్లలతో పాటు చేతకాక తనూ ఏడుస్తున్న ఒకానొక దిక్కుమాలిన ఎల్లమ్మముఖం కనిపించింది. ఎలాగైతే ఏం, ఇన్ని బాధలూపడి చిటచివరికి ఆ శేషమ్మ తల్లి ధర్మమా అని తనూ పిల్లలూ ఇంతతింటూ రోజులు నెట్టుకు వచ్చారు. అమాంతంగా ఎవరో కుదిపినట్లు ఎల్లమ్మకి తనీ మధ్య శేషమ్మగారింట చేసినపని ఒక కొత్త కోణంలో కనబడింది. తను చేసినపని ఘోరమైన దొంగ పనిగాని కాదుగదా? అనుమానం వేసింది—అనుమానం నిశ్చయంగా మారింది. నమ్మిన వాళ్ళకు ద్రోహం చెయ్యడం కాదా? నిజం, నిజం ద్రోహమే. తక్షణమే ఆమె ఓ నిశ్చయానికి వచ్చింది. ఆ డబ్బులో ఒక్క దమ్మిడఅయినా, చిన్న మెత్తు బంగారమేనా తన కింతమాత్రం హక్కులేదు. ఇలాంటి స్వామి ద్రోహం పనులుచేసేవే తనవంటి వాళ్ళకి తక్కువ పనులు చేసుకుంటూ బ్రతికేగతి దేముడు నెత్తిని రాసిపెడతాడు. ఆ మహాతల్లి అన్నపూర్ణమ్మ చెయ్యి చల్లనితల్లి. శేషమ్మ తల్లికి ద్రోహం చేసింది. తనమీద పిడుగు పడకుండా ఇంతకాలం ఎలా బ్రతికిఉన్నానా అని ఆశ్చర్యపడ్డది.

మూడురోజులయింది. లచ్చన్న జబ్బు ఉధృతం అంతంతమాత్రం తగ్గినట్టుంది గాని, వాడిస్థితి ప్రమాదంగానే ఉంది. వైద్యుడు రోజూ వస్తూనే ఉన్నాడు, చూస్తూనే ఉన్నాడు మందిస్తూనే ఉన్నాడు, కొంచెం ఆలస్యమౌతుంది గాని వాడికేమీ భయంలేదని ధైర్యం చెబుతూనే ఉన్నాడు. ఎల్లమ్మకి మాత్రం వాడినిచూసి కడుపు తరుక్కుపోతున్నది. తనకొడుకు తనకు దక్కడా? జబ్బు మళ్ళదా? దిక్కుమాలిన తను ఇప్పుడెవరికాళ్ళు పట్టుకోవడం?

మూడోనాటి సాయంత్రం కనుమాపు చీకటి పడుతున్నది. కొడుకు మంచందగ్గరే కూచొని ఎల్లమ్మ జావ కావాలా అని వాడి నడుగుతున్నది. ఇంతముందొక జట్కా ఆగిన చప్పుడు ఆమెకి వినబడి తల గుమ్మం వేపు తిప్పి చూసింది వంటినిండా గుడ్డ కప్పుకొని శేషమ్మ బండిదిగి గుమ్మంలోంచి లోపలికి తొంగిచూస్తూ, "ఎల్లమ్మా" అని పిలిచింది.

ఎలమ్మ దిగున లేచి గుమ్మందగ్గిరికివచ్చి శేషమ్మను చూస్తూనే నిర్ఘాంతపోయింది. నోటమాట పెగలలేదు. వొణుకు పట్టుకుంది. శేషమ్మగారికి కనబడకుండా ఎక్కడికైనా పారిపోదామా అనుకుంటూ అటూ యిటూ చూస్తున్నంతలోనే శేషమ్మ అంది:

"ఏమే, మూడురోజులాయ ఇంటికే రావడం మానేశావు? ఎలా ఉందేని కొడుకుకి?"

ఎలమ్మ జవాబుచెప్పక తప్పలేదు.

"ఇంకా అలాగే ఉందండమ్మగారు."

"అవునే, మొన్న నీకు డబ్బిస్తూఉంటే పుచ్చుకోకుండా ఏవో గావుకేకలు పెడుతూ అలా పారిపోయేవేమే?"

ఎల్లమ్మ బెల్లంకొట్టిన రాయిలా కిక్కురుమనలేదు.

"ఏమే మాటాడవు? బీద కూతురివి, ఆపదలో పడ్డావు. నీకేం మతిపోయిందే, డబ్బు పుచ్చుకోకుండా పారిపోయేవు?" పకాలున శేషమ్మ నవ్వింది. "లేకపోతే—ఏమే నా డబ్బు కూడవేసి ఉంచుకున్నావుటే?"

శేషమ్మ నవ్వువిన్న ఎల్లమ్మ కళ్ళముందో వెలుగు వెలిగిట్టినట్టు తోచింది ఆమె అమాం

రవి టాయిలెట్స్ అందమునకు, వర్చస్సునకు

రవి గ్లిసరిన్ సోప్:—అన్ని కాలముల్లో ముఖ్యంగా వేసవికాలములో వాడదగినది. శరీరమును మృదువుగను, కాంతిగను ఉంచును

రవి వెజిటబుల్ హేరాయిల్. శిరోజములను విస్తారంగా పెంపొందించును దానిచక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.

రవి స్నో:-ముఖవర్చస్సును కాపాడి, విలాసమును పెంపొందించును. సోల్ ఏజెంట్లు:-

ది న్యూస్టార్ & కంపెని,

10, వద్యనాథ మొదలివీధి, మద్రాసు 12

తంగా నేలమీద బోర్లా చాగిలపడి శేషమ్మ రెండుకాళ్లూ పట్టుకొని వలవలా ఏడవ సాగింది.

శేషమ్మ నిర్ఘాంతపోయింది.

"ఎమిటే ఎల్లమ్మా!" అన్నదామె. "లే, కాలోదులు. సంగతేమిటో సావకాశంగా చెప్పాలిగాని, నా కాళ్లు పట్టుకోవడ మేమిటే?"

ఎల్లమ్మ లేవలేదు. ఏడుస్తూ, వెక్కుతూ, మధ్య మధ్య ఒక్కొక్క మాటగా అన్నది:

"అమ్మగారు - శేషమ్మతల్లీ - తమరు - చెమించేనూ అంటేనే—తమరి పాదాలు - ఒగులేను—లేకుంటే—"

శేషమ్మకి నిజంగా ఆశ్చర్యం వేసింది. ఇది క్షమించమంటుందేమిటి? దేనికి క్షమించడం? ఇది ఏమి కానిపని చేసిఉంటుంది చెప్మా!" ఆమె కేమీ అంతు చిక్కలేదు.

"ఏమిటే వెర్రిదానా, నిన్ను క్షమించడ మేమిటే?-సరలే, నీ మాటేకానీ, క్షమించానులే. ఇంక నీ కేం భయంలేదు, చెప్పు."

ఎల్లమ్మ లేచికూచుంది. శేషమ్మపాదాల మీద చేతులలా ఉంచుతూనే ఒక్కొక్క మాటా అంది.

"శేషమ్మ తల్లీ, మీరేమో-దేముడిలాంటి వోళ్లు. నేనేమో-పాపం వొడికట్టుకున్న దాన్ని. ఆ రోజు, బాబుగారు కాలంజేసి నప్పుడు-గదిలో దూరి-చందుగుపెట్టె తీసి-డబ్బూ బంగారం మూటగట్టుకొని పెరటి దోవను మా యింటికి పారొచ్చి-అటక మీద మూట దాచేసినాను."

ఈ మాటలువింటూ శేషమ్మ నీరై పోయింది. ఇన్నాళ్లకు తెలిసింది. తన ధన మెలామాయమై పోయిందో. ఇన్నాళ్ళకేనా తెలిసిందే! క్షణకాలం ఆమె మనస్సంతా భగున మండి పోయింది-క్షణ కాలం మాత్రమే ఆమె వెంటనే మనస్సును స్వాధీనం చేసుకొని, ప్రశాంత వదనంతో చిరునవ్వు నవ్వింది. ఆత్మనిగ్రహమూ సంస్కారమూ గలవారు ఎట్టి విపత్తులు పైబడినా వెంటనే తెములుకుంటారు. నవ్వు ముఖంతోనే శేషమ్మ అంది.

"పోనీలేవే ఎల్లమ్మా. నువ్విప్పుడు మంచి విపత్తులో ఉన్నావు. అయిందేదో అయిపోయింది. ఎవరో ఒకరు తినాలిగదా, పోనీ నువ్వే తిన్నావు. ఆ డబ్బు నీకే ప్రాప్తమైందిలే. నా భర్త సంపాదించిన భూములే నాకు ఎక్కడొక్కనీ. ఆ మహారాజు నాకేమీ అన్యాయం చెయ్యలేదులే. ఇహ లే, లేచిపో. నిన్ను మనస్ఫూరగా క్షమిసున్నాను"

"మాయమ్మా! శేషమ్మతల్లీ! నీ ధనంలో ఒక్క దమ్మిడీ - ఒక్క చిన్న మెత్తు బంగారం - నేను ముట్టలేదు."

"ఏమిటే!"

"ఉండండుండండి." ఎల్లమ్మ అమాంతంగా లేచి, అటకకి నిచ్చెన వేసి, తొందరగా నిచ్చెన ఎక్కసాగింది. అప్పుడే కోడలు అక్కడికివచ్చి శేషమ్మనుచూసి గతుక్కుమని వెనకకు తగ్గింది. అత్త తొందరగా అటక ఎక్కడం ఆమెకీ ఆశ్చర్యం వేసింది. కొద్దినిముషాలలో ఎల్లమ్మ తిరిగి ప్రత్యక్షమైంది. ఆమె చంకలో ఒక కుండ ఉంది. శేషమ్మ సమీపంగా ఆకుండదింపి, లోపల కూలిన పాతగుడ్డలన్నీ పైకిలాగిపార వేసి, అడుగున ఉన్న మూట పైకితీసి ఆమె పాదాల దగ్గిరుంచి మూట విప్పింది.

"ఇదోనండమ్మా మీధనమంతా" అంటూ ఎల్లమ్మ లేచి చేతులు జోడించింది.

శేషమ్మ పడ సంభ్రమాశ్చర్యాల కంతు లేదు. ఆమె అన్నది: నువ్వేమో నాకు ద్రోహం చేశానంటున్నావుగాని, ఎలమ్మా, నువ్వు నాకు మహోపకారం చేశావనే అంటాను. అమాయికంగా నా ధనమంతా నాకు ఇచ్చేశావు."

"కాదమ్మా, ఇనండి" అంది ఎలమ్మ. "ఈ బంగారంలో నానానుంది. అది బాబు గారికాడ తనకాపెట్టి వొందరూపాయిలు తెచ్చినాను. వొడ్డీతో సహా నూటముప్ఫై రూపాయిలూ తీర్చినాను. లచ్చిమీ సుక్కురోరాలలో నా సరుకివ్వనన్నారు. శనోరంరోజే బాబు పోయేరు. నా సరుకు పోతుందేమో అని భయమేసి గదిలోదూరి పెట్టె తీసినాను. డబ్బు సూసి దురుబుద్ది పుట్టింది. అంతా మూటగట్టినాను. అంతే."

శేషమ్మ ధనంమూటదగ్గిర కూచొని బంగారం అటూ ఇటూ కెలికి నాను పైకి తీసింది.

"ఇదేనా నీ నాను?"

"ఇదేనమ్మా" అంది ఎల్లమ్మ, పరమ సంతోషంగా. శేషమ్మ ఎలమ్మ చేతులో నానుపెట్టి, మళ్ళీ వంగి దోసెడు రూపాయిలు పైకితీసి, "ఇవికూడా తీసుకో" అంది.

"అమ్మో!" భయంగా కేకేస్తూ ఎల్లమ్మ దూరంగా పారిపోయి, గద్గద స్వరంతో అంది:

"వొద్దమ్మో—నా కొడబ్బు వొద్దు. ధరమదాతలు మీరు. నాలుగు కాలాలపాటు సల్లగా ఉండండి మమ్మల్ని మీ సాటున బతకనివ్వండి—అవి మళ్ళీ మూటగట్టు మా తల్లీ"

శేషమ్మ మళ్లీ పకాలున నవ్వింది. ఎప్పుడోగాని నవ్వని శేషమ్మ అలా ఎల్లమ్మగుడిసెలో నవ్వేసరికి గుడిసెలో అందరికీ మనసులు తేలికపడాయి శేషమ్మ ధనమంతా తన గుడలో మూటగట్టింది లచ్చన్నమంచం దగ్గిరికి వెళ్లి వాడి నుదిటిమీద చెయ్యి వేసి అన్నది:

"ఆశీర్వదిస్తున్నాను లచ్చన్నా, వేగంగా కోలుకో—కోలుకోవాలి ఇదుగో విను. నువ్వెంత వేగంగా కోలుకుంటే అంత వేగంగానే పది పాడిగేదలు మీ సాలలో వచ్చి ఉంటవి. నువ్వు మరి కూలిపని చెయ్యవద్దు"

★



"మాష్టారండి! మా వాడికి వంట్లో బాగాలేదండీ! ఇవ్వాళ బడికి రాడండి...మాట్లాడుతూంది మానాన్నా రేనండి...!"